నూతన కార్యవర్గం

ఎన్నికైన సంఘం కార్యవర్గ సభ్యులు

సీసీసీ నస్పూర్, జులై 7: మంచిర్యాల, ఆసిఫాబాద్ ఉమ్మడి జిల్లాల కరాటే మాస్టర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సీసీసీ నస్పూర్‌లోని మార్టిన్ గ్రామర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మోకపల్లి నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రంగు శ్రీనివాస్, కోశాధికారిగా పోచంపల్లి వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా కుందేలు రవి, నర్సయ్య, మొయిన్, రంగ రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా సౌమ్య, చందు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కర్ర వెంకటేశ్ ఎన్నికయ్యారు. రెండు జిల్లాల కరాటే మాస్టర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

బోనం ఎత్తుకున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, జులై 7: సీసీసీ నస్పూర్‌లో ఆదివారం ముక్కిడి పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి-రాధాకుమారి దంపతులు, మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు హాజరయ్యారు. కాగా, గోదావరికాలనీ వేంకటేశ్వరాలయం వద్ద నుంచి మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా నాగార్జునకాలనీ, సుందరయ్యకాలనీ మీదుగా సీసీసీ టౌన్‌షిప్ నుంచి ముక్కిడి పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం, మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సాతూరి రమేశ్, భక్తులు పప్పు శ్రీనివాస్, పడాల సంజీవ్‌గౌడ్, బ్రహ్మశ్రీను, గజ్జెల్లి రాజలింగు, దేవయ్య, వెంకన్న, శంకర్‌రెడ్డి, మల్లేశ్, రాహుల్, సంతోష్, అట్కపురం రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, జులై 7: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవీ స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సీఎఫ్‌సీ కార్మికుల వెతలు

- రెండు నెలలుగా అందని వేతనాలు
- త్వరగా చెల్లించాలని వేడుకోలు

వాంకిడి, జులై 7: మండల కేంద్రంలోని సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్) కార్మికులు రెండు నెలల బిల్లులు, వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. వేతనాలు, బిల్లులు నిలిచిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ పరిశ్రమలో ప్రభుత్వ పరంగా ఆర్డర్లు రాకపోవడంతో కార్మికులకు చేతినిండా పని లేకుండా పోయింది. దీంతో సీఎఫ్‌సీలో పని చేస్తున్న కార్మికులకు సరైన ఉపాధి లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ కార్పొరేట్ సంస్థ నుంచి మూడు నెలల క్రితం పాఠశాలలకు డ్యూయల్ డెస్క్‌ల ఆర్డర్లు రాగా, తయారు చేసి సిద్ధంగా ఉంచారు. వాటికి సంబంధించిన పూర్తి బిల్లులు రాలేదు. రెండు నెలలకు సంబంధించిన కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలలుగా ఆర్డర్లు లేక సీఎఫ్‌సీ కార్మికులంతా ఖాళీగా ఉంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వేతనాలతో పాటు 30 ఏళ్లుగా సీఎఫ్‌సీ పరిశ్రమను కాపాడుకుంటూ వస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఆర్డర్లు ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా 1970లో వృత్తి శిక్షణ కేంద్రంగా సీఫ్‌సీని ఏర్పాటు చేశారు.1980లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధీనంలోకి తీసుకువచ్చారు. కలపతో వివిధ రకాల సామగ్రి తయారు చేయడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ చర్యలు తీసుకుంది. ఇక్కడ పని నేర్చుకున్న వారు సొంతంగా వస్తుసామగ్రి తయారు చేస్తూ జీవనోపాధి పొందే వారు. 1987–88లో ఐటీడీఏ ఆధ్వర్యంలో షెడ్లు, భవన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, కుమ్రం భీం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిలు పలుమార్లు వాంకిడి సీఫ్‌సీని సందర్శించి అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గత ఆగస్టులో ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి రూ.3 లక్షల విలువ చేసే కలప వస్తువుల తయారీకి ఆర్డర్లు ఇప్పించారు. వరుణ్ రెడ్డి, చాహత్ బాజ్‌పాయ్ బెంగళూర్‌కు చెందిన బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) కంపెనీ నుంచి రూ.34 లక్షల విలువ చేసే 500 డ్యూయల్ డెస్క్‌లు ఆర్డర్ వచ్చేలా కృషి చేశారు. కొన్నేళ్ల తర్వాత పెద్ద మొత్తంలో ఆర్డర్ లభించడంతో పదుల సంఖ్యలో కార్మికులకు ఉపాధి లభించింది.

ఆర్డర్లు వస్తే సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న డ్యూయల్ డెస్క్‌లు

సకాలంలో వేతనాలు ఇవ్వాలి

రెండు, మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నం. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి. అలాగే, ఆర్డర్లు కూడా ఇప్పించాలి.

-ఎం సుభాష్, సీఎఫ్‌సీ కార్మికుడు

కుటుంబ పోషణ భారంగా మారింది

మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతనాల కోసం ప్రతి రోజూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు వచ్చేలా చూడాలి. -బంక రాము, సీఎఫ్‌సీ కార్మికుడు

ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం

సీఎఫ్‌సీ పరిశ్రమలో నెలకొన్న సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం. సీఎఫ్‌సీలో ప్రస్తుతం 30 నుంచి 35 మంది కార్మికులకు సంబంధించిన రెండు నెలల వేతనాలు రావాల్సి ఉంది. త్వరలో కార్మికుల వేతనాలు, ఆర్డర్ బిల్లులు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని పీవో తెలిపారు. కొత్తగా ప్రభుత్వ ఆర్డర్లు వచ్చేలా చర్యలు చేపడుతామని భరోసా కల్పించారు.

-పైకాజీ, సీఎఫ్‌సీ ఇన్‌చార్జి

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

మందమర్రి, జూలై 7: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని యాపల్ ఏరియా కేకే ఓసీ సమీపంలో గల శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని సమీప కాలనీల వాసులు కోరుతున్నారు. శ్మశాన వాటిక, దాని పక్కన గల ఖాళీ స్థలం తమదేనంటూ మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన కొందరు జేసీబీలు, ట్రాక్టర్లతో చదును చేయించారు. స్థానిక యాపల్, రాజీవ్‌నగర్, తదితర కాలనీల ప్రజలు ఆదివారం వెళ్లి అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలకు సర్దిచెప్పారు. దీంతో భూమిని చదును చేస్తున్న వ్యక్తులు పనులను నిలిపి వేశారు. కాగా, యాపల్ సమీప కాలనీల ప్రజలు మాట్లాడుతూ, చదును చేసిన స్థలంలో 50 సంవత్సరాలుగా శ్మశాన వాటిక ఉన్నట్లు తెలిపారు. తమ కుటుంబాలకు చెందిన వ్యక్తులకు సంబంధించిన గోరీలు కూడా ఉన్నాయని, వారి గుర్తుగా తాము చెట్లను పెంచినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా స్థల వివాదంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ శశిధర్ రెడ్డి

ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జానపాటి శరత్‌బాబు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సీసీసీ నస్పూర్, జూలై 7: సీసీసీ నస్పూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీసీసీ రాయల్ టాకీస్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ జానపాటి శరత్‌బాబు, చుంచు శంకర్‌వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్‌లో త్వరలోనే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోతె పోశయ్య, గొడిసెల దశరథం, గడ్డం సత్యం, ఎస్ఆర్ బోస్, మంతెన రాయమల్లు, అట్కాపురం రాయమల్లు, సింహాచలం, రాజు, అప్పారావు, గొడిసెల రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లో, ఎరుపు కార్డు విధానం ఎత్తివేయాలి'

శ్రీరాంపూర్, జులై 7: సింగరేణి యాజమాన్యం కార్మికులపై క్రమశిక్షణ చర్యల పేరిట నిబంధనలకు వ్యతిరేకంగా అమలు చేయాలని చూస్తున్న ఎల్లో, ఎరుపు కార్డు విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనింగ్ స్టాఫ్, కార్మికులను అయోమయానికి గురి చేయడానికి యాజమాన్యం ఏకపక్ష విధానాలు అమలు చేస్తున్నదన్నారు. అధికారులకు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమం, సేఫ్టీపై లేదని ఆరోపించారు. కార్మికులపై ఓ వైపు పనిభారం మోపుతూ, మరో పక్క వేధింపులకు పాల్పడుతున్నదన్నారు. 6 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు యాజమాన్యం కార్మికుల రక్షణకు సంబంధించిన సేఫ్టీ ట్రైపార్టియేట్ సమావేశం నిర్వహించలేదని ఆరోపించారు. సింగరేణిలో డైరెక్టర్ పా పోస్టును భర్తీ చేయడం లేదన్నారు. వెంటనే ఎల్లో, ఎరుపు కార్డుల విధానం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సల్లంగ సూడు పోచమ్మ తల్లీ

దస్తురాబాద్, జూలై 7: మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్లతో బోనాలను నెత్తిన ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. బోనాల్లో తెచ్చిన నైవేద్యం అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తాత్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, మండల ఆటో డ్రైవర్ల యూనియాన్ ఆధ్వర్యంలో డబల్ రాజ్ దేవుడికి, గండి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

నార్నూర్, జూలై 7: గంజాయి నిర్మూలనే లక్ష్యమని గాదిగూడ ఎస్ఐ మహేశ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ, ఉట్నూర్ డీఎస్పీ, నార్నూర్ సీఐ పర్యవేక్షణలో సీసీఎస్ బృందం, పోలీసులు ఆదివారం గాదిగూడ మండలం కొత్తపల్లి(జీ), మేడిగూడ గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ముగ్గురి వద్ద రూ.3,.30 లక్షల విలువైన 13.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గాదిగూడ పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గంజాయి పండించినా, రవాణా చేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పశువుల వాహనం పట్టివేత

వాంకిడి,జూలై 7:ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం రాత్రి వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవేధరి సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా, వాంకిడి వైపు వెళ్తున్న వాహనంపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా ఐచర్‌లో ఐదు ఆవులు, రెండు దూడలను అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని గమనించి డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని వాంకిడి ఠాణాకు తరలించారు. ఎలాంటి అనుమతులు పత్రాలు లేకుండా పశువులను అక్రమంగా పెబ్బేరుకు తరలించేందుకు తీసుకెళ్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్ రూరల్, జులై 7: మండలంలోని గిరిజన ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024 విద్యా సంవత్సరానికి గానూ రెండో విడత ప్రవేశానికి విద్యార్థులను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, పదో తరగతి పాసై, 14 సంవత్సరాలు నిండిన వారు వెబ్‌సైట్ https://iti.telangana.gov.in ద్వారా ఈ నెల 15లోగా ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కారు కొంటారా?

నేడు కారు ప్రతి ఒక్కరికీ అవసరంగా మారుతున్నది. నిజంగా చెప్పాలంటే కారు కొనేందుకున్న అవకాశాలూ అందరికీ పెరిగిపోయాయిప్పుడు. చాలామంది ఆర్థిక స్థోమత బలపడటంతో కార్ల అమ్మకాలూ జోరుగా సాగుతున్నాయి. అయితే కారు అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సొంతింటి తర్వాత చాలా మంది కల కారు కొనుగోలేననడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే కారు కొనుగోలులో తెలివిగా వ్యవహరించండి.

ఏం చేయాలి.. ఏం చేయొద్దు

ఇవి గుర్తుంచుకోండి

- ✓మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ కార్ల మాడళ్లను, వాటి ధరలను, రుణ సదుపాయాలను పూర్తిగా పరిశీలించండి.
- ✓మీ బడ్జెట్‌కు తగ్గ కారు దొరికేదాకా వెతకండి. ధరతోపాటు నిర్వహణ, బీమా, ఇతరత్రా వ్యయాలనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.
- ✓తుది నిర్ణయం తీసుకొనే ముందు టెస్ట్ డ్రైవ్‌కు సమయం తీసుకోవాలి. ఆపైనే కారు కొనుగోలుకు వెళ్లడం ఉత్తమం.
- ✓కారును కొనే ప్రక్రియలో మీపై ఏవైనా తెలియని చార్జీల భారం ఉంటున్నదా? అని గమనించండి. అనవసరంగా ఏ సర్వీసునూ తీసుకోవద్దు.
- ✓సంతకాలు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు డాక్యుమెంట్లను పూర్తిగా చదవండి. ఫైనాన్స్, లీజ్ అగ్రిమెంట్ల నియమనిబంధనలను, షరతులను తెలుసుకోండి.



ఇవి చేయండి

బడ్జెట్ వేసుకోవాలి

కారు కొనాలన్న ఆలోచన రాగానే ముందుగా బడ్జెట్ సెట్ చేసుకోండి. దీనివల్ల మీ కష్టార్జితం వృథా కాకుండా జాగ్రత్త పడవచ్చు. స్థోమతకు మించిన ఖర్చులకెళ్లడం లేనిపోని కష్టాలనే తెచ్చిపెడుతుంది. ఇక కారుకు చెల్లించే అధిక ధర.. బీమా, చెల్లించే వడ్డీలను ప్రభావితం చేయగలదని మర్చిపోవద్దు.

ఫీచర్లు చూడాలి

ఒకప్పుడు కారు అంటే.. కేవలం ప్రయాణ సాధనమే. కానీ ఇప్పుడు అంతకు మించేనని చెప్పవచ్చు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేడు వస్తున్న కార్లలో ఎన్నో ఫీచర్లుంటున్నాయి. కాబట్టి రకరకాల కంపెనీలు తెస్తున్న కార్ల గురించి, వాటిలోని ఫీచర్ల గురించి పూర్తిగా తెలుసుకొని మార్కెట్‌లోకి అడుగుపెట్టండి. ఇందుకోసం సంప్రదాయ, ఆన్‌లైన్ వేదికలను వాడుకోండి.

టెస్ట్ డ్రైవ్ చేయాలి

మీరు ఎంచుకున్న బడ్జెట్‌లో వస్తున్న ప్రతీ కారునూ టెస్ట్ డ్రైవ్ చేయండి. అప్పుడే మీకు సౌకర్యవంతమైన వాహనాన్ని సొంతం చేసుకోగలరు. అంతేగాక టెస్ట్ డ్రైవ్‌లో రకరకాల రోడ్లపై కారు ఎలా ప్రయాణిస్తున్నది, లోపల కూర్చున్నవారికి ఎలా అనిపిస్తున్నది? అన్నదానిపైనా అవగాహన వస్తుంది. కారులోని లోపాలనూ గుర్తించవచ్చు.

ఫైనాన్స్‌కు వెళ్తే..

నేరుగా నగదు కంటే ఫైనాన్స్ ద్వారా కారు కొనేవారే ఎక్కువ. మీరూ ఆ దారిలోనే వెళ్లాలనుకుంటే ఏయే బ్యాంకుల్లో వాహన రుణాలపై ఎంతెంత వడ్డీరేట్లున్నాయి? ఇతర చార్జీల మాటేంటి అన్నది ఆరా తీయండి.

ఇవి చేయకండి

తొందరపడి..

కారును చూసో.. ఆయా సంస్థలు, డీలర్లిచ్చే ఆఫర్లకు ఆకర్షితులయ్యో.. ఎవరి బలవంతంతోనో.. కొనేందుకు బయలుదేరవద్దు. కుటుంబ సభ్యులతో చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే ఓ నిర్ణయానికి రావాలి. అప్పుడే ఎల్లవేళలా మీకు వారి మద్దతుంటుంది.

ఎక్కువ ఈఎంఐలు వద్దు

రుణ వాయిదాలను పెంచుకుంటే మీపై భారం తగ్గుతుందని డీలర్లు చెప్తే దాన్ని నమ్మవద్దు. ఎందుకంటే ఈఎంఐలు పెరిగితే మీపై వడ్డీ భారం పెరుగుతుంది. కాబట్టి ఈఎంఐ ఎక్కువైనా.. వీలైనంత త్వరగా రుణ విముక్తులయ్యేందుకే మొగ్గు చూపండి. డౌన్ పేమెంట్ ఎక్కువగా కడితే రిలీఫ్‌గా ఉంటుంది.

ఊ కొట్టొద్దు

చెప్పిన ధరకే కాకుండా డీలర్లతో ఇంకా రేటు తగ్గేదాకా సంప్రదింపులు జరుపండి. డాక్యుమెంటేషన్, డెస్టినేషన్ చార్జీలు, పన్నులు, ఇతరత్రా ఫీజుల గురించి తెలుసుకొని, వాటిని వీలైనంత వరకు దూరం చేసుకునేలా మాట్లాడండి. బెటర్ డీల్‌కు ప్రయత్నించండి. కారు కొన్న తర్వాత అదనపు యాక్సరీస్ బిగించుకోవడంలోనూ జాగ్రత్త వహించి అవసరమైతేనే ముందుకెళ్లండి.

పాత కారు విషయంలో..

మీకు పాత కారు ఉంటే దాన్ని అమ్మే విషయంలో తొందరపడవద్దు. ఎక్కువ ధర వస్తున్నదని అమ్ముకుంటే.. కొత్త కారు విషయంలో ఏదైనా తేడా కొడితే అనవసరపు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు ఈ నెలాఖరే (జూలై 31). అయితే కొత్త పన్ను విధానంలో అనేక మార్పులొచ్చాయి. కాబట్టి వాటిని గుర్తుంచుకుంటే మంచిది.

ఈ మార్పులు తెలుసా?

- *2023-24 మొదలు కొత్త పన్ను విధానం డీఫాల్ట్ హోదాను అందుకున్నది. కనుక పన్ను మినహాయింపులను ఆశించే వేతన జీవులు వారి కంపెనీ యాజమాన్యాలకు పాత పన్ను విధానాన్ని కోరుకుంటున్నట్టు తెలియపర్చాలి. లేకపోతే కొత్త పన్ను విధానం పరిధిలో మీకు పన్ను రేట్లు వర్తిస్తాయి.*
- *కొత్త విధానంలో రిబేటు పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెరిగింది. మీకు వార్షిక వేతనం రూ.7.5 లక్షలున్నా పన్ను కట్టనక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ మరో రూ.50,000 ఉండటమే కారణం. పెన్షనర్లకూ ఈ ప్రయోజనం ఉంటుంది.*
- *కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ఐటీ స్లాబులను 6 నుంచి 5కు తగ్గించారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్నుండదు. రూ.3-6 లక్షల మధ్య 5%, రూ.6-9 లక్షల మధ్య 10 %, రూ.9-12 లక్షల మధ్య 15 %, రూ.12-15 లక్షల మధ్య 20 %, రూ.15 లక్షలు దాటితే 30 % పన్నుంటుంది.*

పీపీఎఫ్ ఖాతా లాభాలివే..



పొదుపునకు, దీర్ఘకాలిక మదుపునకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) చక్కని సాధనం. పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ వ్యక్తుల ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుంది. పీపీఎఫ్ వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 3 నెలలకోసారి సమీక్ష జరుగుతుంది. ప్రస్తుత వార్షిక వడ్డీరేటు 7.1 శాతం. కనీసం 15 ఏండ్ల లాకిన్ పీరియడ్‌తో ఐదేండ్లు నిరవధికంగా ఖాతాను పొడిగించుకోవచ్చు. ఈ ఖాతా లాభాలను పరిశీలిస్తే..

అధిక వడ్డీరేట్లు

పీపీఎఫ్‌లో వడ్డీరేట్లు సాధారణంగా 7-8 శాతంగా ఉంటాయి. సేవింగ్స్ ఖాతా వడ్డీరేటు 3-4 శాతమే. అందుకే పీపీఎఫ్ ఖాతాలు ఆకర్షణీయంగా మారాయి.

పన్ను ప్రయోజనాలు

ఖాతాలో జమయ్యే మొత్తాలతోపాటు వాటిపై పొందే వడ్డీ ఆదాయానికీ ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరం తమ పీపీఎఫ్‌కు ఖాతాదారులు రూ.500కు తగ్గకుండా, రూ.1.5 లక్షలకు మించకుండా జమ చేసుకోవచ్చు.

సురక్షిత పెట్టుబడి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకమే పీపీఎఫ్. కాబట్టి ఇదో సురక్షిత పెట్టుబడి. కచ్చితమైన, స్థిరమైన రాబడులుంటాయి. స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకున్న రిస్క్ ఇక్కడ ఉండదు.

రుణ సౌకర్యం

ఖాతాదారులు తమ ఖాతాలో ఉన్న నిల్వల్లో 25 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు. ఖాతా తెరిచిన ఐదేండ్ల తర్వాత కొద్దికొద్దిగా (బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు) నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

పీపీఎఫ్ ఖాతాకు ఎవరు అర్హులు?

- ✓భారతీయ పౌరులై ఉండాలి.
- ✓ఖాతాను కేవలం ఒక్కసారే తెరవగలం.
- ✓మేజర్లు అయ్యేదాకా మైనర్ల పేరిట వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పీపీఎఫ్ ఖాతా తెరిచి నిర్వహించవచ్చు.

ఏయే పత్రాలు కావాలి?

- ✓ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర కేవైసీ ధ్రువీకరణలు.
- ✓ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు.
- ✓అకౌంట్ తెరిచే ఫారం.
- ✓నామినీ వివరాలు.

ఖాతాను ఎలా తెరవాలి?

- ✓ప్రధాన బ్యాంకులన్నింటిలో ఈ ఖాతా సౌకర్యం ఉంటుంది.
- ✓బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లోకి లాగిన్ అవ్వాలి.
- ✓'ఓపెన్ ఏ పీపీఎఫ్ అకౌంట్' ట్యాబ్‌ను ఎంచుకోవాలి.
- ✓మైనర్ల కోసం అయితే 'మైనర్ అకౌంట్', మీ కోసమే అయితే 'సెల్ఫ్ అకౌంట్'ను ఎంచుకోవాలి.
- ✓ఆపై అడిగిన వివరాలన్నీ దరఖాస్తు ఫారంలో నింపి సరిచూసుకోవాలి.
- ✓ప్రతీ ఆర్థిక సంవత్సరం మీరు డిపాజిట్ చేసే మొత్తాన్ని పేర్కొనాలి.
- ✓పీపీఎఫ్ ఖాతాలోకి మీ సేవింగ్స్ ఖాతా నుంచి డిపాజిట్లు వెళ్లేందుకు అనుమతులివ్వాలి.
- ✓ఓటీపీని పొందేందుకు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.
- ✓ఓటీపీని ఎంటర్ చేసి ధ్రువీకరించుకోవాలి.
- ✓ఆపై మీ ఖాతా మొదలవుతుంది. ఈ సమాచారం మీకు ఫోన్ మెసేజ్ లేదా ఈ-మెయిల్ ద్వారా వస్తుంది.

ఆటుపోట్లకు అవకాశం

మార్కెట్ పల్స్



గత వారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డుల మోత మోగింది. సూచీలు జీవనకాల గరిష్ఠాల వద్ద ఉన్నా.. మదుపరులు పెట్టుబడులకే ఆసక్తి కనబర్చారు. అక్కడక్కడా అమ్మకాల ఒత్తిళ్లకు లోనైనా.. ఓవరాల్‌గా మాత్రం కొనుగోళ్లతో కదం తొక్కారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు నయా ఆల్‌టైమ్ హైలను సృష్టించాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 963.87 పాయింట్లు ఎగిసి 80 వేలకు కూతవేటు దూరంలో 79,996.60 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 313.25 పాయింట్లు ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,323.85 దగ్గర నిలిచింది. నిజానికి సెన్సెక్స్ తొలిసారి 80 వేలను దాటిపోయింది. నిఫ్టీ కూడా 24,400 పాయింట్లను అధిగమించింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణ వైపు నడిచారు. దీంతో ఈ చారిత్రక స్థాయిల్లో సూచీలు నిలబడలేకపోయాయి. ఈ క్రమంలో ఈ వారం మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల నడుమ ఊగిసలాటకు గురికావచ్చన్న అంచనాలున్నాయి. అందుకే సూచీల ఆటుపోట్లకు అవకాశాలున్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.